సాక్షి
కర్నూలు
బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



మహానంది కిటకిట

మహానంది: మహానందీశ్వర ఆలయం మంగళవారం భక్తులతో పోటెత్తింది. భక్తులు కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.



..కేసును నీరుగార్చే యత్నం

నుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి కేసును రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ విమర్శించారు.

8లో▸




టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,611.08
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:39.689
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:9,110

కలవరపెడుతున్న జీబీఎస్

ఉన్నట్లుండి జ్వరం వస్తుంది. క్రమంగా తల నుంచి పాదాల వరకు నరాలు చచ్చుబడిపోయి కాళ్లూ, చేతులు పడిపోతాయి. కొందరికి ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. దీనినే గులియన్ బ్యారీ సింద్రోమ్ (జీబీ సింద్రోమ్) వ్యాధి అంటారు. ఈ వ్యాధి ప్రస్తుతం జిల్లా వాసులను కలవర పెడుతోంది. దీని తాలూకు మరణాలు జిల్లాలో లేకపోయినా ఏడాది కాలంగా ఈ వ్యాధితో 48 మంది ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స అందుకున్నారు. అయితే ఈ వ్యాధికి ఇచ్చే ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్ల సరఫరా మూడు నెలల నుంచి కూటమి ప్రభుత్వం నిలిపేయడంతో పేదలపై భారం పడుతోంది.



- గత ఏడాది నుంచి జీజీహెచ్‌లో 48 మందికి చికిత్స
- వీరి చికిత్సలో ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు కీలకం
- మూడు నెలలుగా ఆగిపోయిన ఇంజెక్షన్ల సరఫరా
- స్థానికంగా కొనుగోలు చేస్తున్న పెద్దాసుపత్రి అధికారులు
- వ్యాధి పట్ల భయం అవసరం లేదంటున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): దేశాన్ని కలవరపెడుతున్న జీబీ సింద్రోమ్ వ్యాధికి సంబంధించిన కేసులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతి నెలా రెండు, మూడు వస్తూనే ఉన్నాయి. గతేడాది జనవరి నుంచి గత నెల జనవరి వరకు 48 మంది రోగులు ఈ వ్యాధితో చికిత్స పొందారు. ఈ ఆసుపత్రికి కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, ప్రకాశం జిల్లాలతో పాటు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో జీబీ సింద్రోమ్‌తో బాధపడే వారూ ఉన్నారు. పక్షవాతం వలే ఈ వ్యాధితో బాధపడేవారు త్వరగా కోలుకునే పరిస్థితి ఉండదు. అందుకే ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ రోగులను చేర్చుకోవడం లేదు. ఎక్కువ శాతం ప్రభుత్వ ఆసుపత్రికే రెఫర్ చేస్తున్నారు. ఈ కారణంగా ఆసుపత్రిలోని చిన్నపిల్లల విభాగం, న్యూరాలజీ విభాగం, జనరల్ మెడిసిన్ విభాగాల్లో బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఈ వ్యాధికి ఖరీదైన ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. వీటి ఖరీదు ఒక్కోటి రూ.11వేల నుంచి రూ.15వేల వరకు ఉన్నాయి. వీటిని జీబీ సింద్రోమ్‌తో పాటు తలసీమియా, తీవ్ర వైరల్ ఇన్‌ఫెక్షన్‌లతో బాధపడే వారికి ఇస్తారు. ఆయా రోగుల పరిస్థితిని బట్టి ఐదు రోజుల పాటు ఇస్తారు. పేదరోగుల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా గత ప్రభుత్వం వీటిని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేసేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి సరఫరా నిలిపివేసింది. ఆసుపత్రి అధికారులు మందులు కావాలని పలుమార్లు ఇండెంట్ పెడుతున్నా స్పందన లేదు. దీంతో స్థానికంగా మందులను కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నారు. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి నెలా 20 నుంచి 25 మందికి ఈ ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఈ ఇంజెక్షన్‌తో పాటు ప్లాస్మాపెరోసిస్ చికిత్స చేస్తారు. మొత్తంగా జీబీ సింద్రోమ్ వచ్చిన రోగికి చికిత్స చేయాలంటే రూ.5లక్షల నుంచి రూ.10లక్షల దాకా ఖర్చు అవుతుందని వైద్యుల అంచనా.

జీబీ సింద్రోమ్‌కు పరీక్షలేవి?

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జీబీ సింద్రోమ్ వ్యాధిని నిర్ధారించే పరీక్షలు ఏవీ చేయడం లేదు. కేవలం వ్యాధి లక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. వాస్తవంగా ఈ వ్యాధి నిర్ధారణకు ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షలు చేయాల్సి ఉంది. ఇవి చాలా ఖరీదైనవి. ఎక్కువగా పేదరోగులు చికిత్స కోసం వస్తుండటంతో పరీక్షలకు రాయకుండా లక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

- కండరాలు బలహీనంగా మారతాయి.
- కాళ్ల నుంచి మెదడు వైపునకు జలదరించినట్లు అనిపిస్తుంది.
- నరాలకు చెందిన మైలిన్ పొర పాడై నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. తిమ్మిర్లు వస్తాయి, కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం, నడవలేకపోతుంటారు.
- మాట్లాడేటప్పుడు, నడిచేటప్పుడు బ్యాలెన్స్ ఉండదు.
- గుండె స్పందన రేటు పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది.
- నడిచేటప్పుడు విపరీతమైన అలసటకు గురవుతారు.
- జీర్ణశక్తి తీవ్రంగా దెబ్బతింటుంది.
- కొన్నిసార్లు ఊపిరితీసుకునే కండరాలు బలహీనపడతాయి. ఊపిరితిత్తులకు సంబంధించి పార్శ్వ న్యూమోథొరాక్స్ వస్తుంది.
- ఈ కారణంగా ఊపిరితీసుకోలేక రోగి మరణించే అవకాశం ఉంటుంది

➤ గత జనవరి నెల 18వ తేదీన కర్నూలు నగరంలోని కల్లూరు ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలుడు జీబీ సింద్రోమ్ లక్షణాలు కనిపించాయి. అతన్ని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అదే నెల 20వ తేదీన చిన్నపిల్లల విభాగంలో చేర్పించారు. వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో బాలుడు కోలుకున్నాడు.

➤ మండల కేంద్రమైన గూడూరులోని కాప స్ట్రీట్‌కు చెందిన మూడేళ్ల బాలుడికి గత నవంబర్ 27వ తేదీన జీబీ సింద్రోమ్ లక్షణాలు కనిపించడంతో అదే నెల 30వ తేదీన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్లు చిన్నారికి సకాలంలో వైద్యం అందించడంతో కోలుకుని క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు.

జీబీ సింద్రోమ్ అంటే..

ఇది ఇమ్యునలాజికల్ ఇమ్మీడియట్ డిజార్డర్‌గా వైద్యులు పరిగణిస్తారు. మన శరీరంలో ఉండే రక్షణ వ్యవస్థ (వ్యాధినిరోధక శక్తి) శత్రుకణాలుగా భ్రమపడి సొంత వ్యాధి నిరోధక శక్తిని కలిగించే కణాలపై దాడి చేయడం వల్లే ఈ వ్యాధి సోకుతోంది. ఈ కారణంగా మన వ్యాధి నిరోధక వ్యవస్థ దెబ్బతింటోంది. నాడీ వ్యవస్థపై దాడి చేయడానికి జీబీ సింద్రోమ్ ప్రేరేపిస్తుంది. ఈ కారణంగా పక్షవాతానికి గురవుతున్నారు. ఇది రావడానికి ఎక్కువగా ఇన్‌ఫెక్షన్లు లేదా కారణం లేకుండా కూడా వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధిలో ఐదు గ్రేడ్‌లు ఉంటాయి. మొదటి గ్రేడ్‌లో రోగులు సాధారణంగా నడుస్తారు. రెండో గ్రేడ్‌లో ఎవ్వరైనా పట్టుకుంటేనే నడవగలుగుతారు. మూడో గ్రేడ్‌లో పట్టుకున్నా నడవలేరు. నాలుగో గ్రేడ్‌లో బెడ్‌కే పరిమితమై ఉంటారు. ఐదో గ్రేడ్‌లో ఆసుపత్రిలోని వెంటిలేటర్‌పై ఉంటారు. ఆరో గ్రేడ్‌లో మరణిస్తారని వైద్యులు తెలిపారు.



కోవిడ్ అనంతరం పెరిగిన కేసులు

జీబీ సింద్రోమ్ వ్యాధిగ్రస్తులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గతంలో అరుదుగా చికిత్స కోసం వచ్చేవారు. కానీ కోవిడ్-19 అనంతరం వైరస్ లేదా వ్యాక్సిన్ వల్ల ఈ కేసుల సంఖ్య పెరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఉత్తర భారత దేశంలో ఇలాంటి కేసులు ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. చండీఘర్‌లోని పీజీఐ వారు ఇందుకు సంబంధించిన స్టడీస్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని వైద్యులు చెబుతున్నారు.

ఏడాదిలో 21 మందికి చికిత్స చేశాం



జీజీహెచ్‌లోని న్యూరాలజీ విభాగంలో గత యేడాది కాలంలో 21 మంది జీబీ సింద్రోమ్ బాధితులకు చికిత్స అందించాం. ఒక్క గత జనవరి మాసంలో ముగ్గురికి వైద్యమందించాం. ఇలాంటి వారికి వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స అందించడంతో పాటు ప్లాస్మా థెరపి లేదా ఇమ్యునోగ్లోబ్లిన్స్ చికిత్స అందజేస్తున్నాం. ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు ఐదు రోజుల పాటు ఇవ్వడం వల్ల వ్యాధి పెరగకుండా నియంత్రిస్తుంది. దీనివల్ల రోగి త్వరగా కోలుకుంటాడు.

– డాక్టర్ సి.శ్రీనివాసులు, హెచ్‌వోడీ, న్యూరాలజీ విభాగం, జీజీహెచ్ కర్నూలు

స్థానికంగా ఇమ్యునోగ్లోబిన్స్ కొంటున్నాం



ఆసుపత్రికి వచ్చే జీబీ సింద్రోమ్ కేసులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చికిత్స అందిస్తున్నాం. వారు మందులు, వ్యాధినిర్ధారణ పరీక్షలకు బయటకు వెళ్లాల్సిన పనిలేకుండా అన్నీ మేము అందిస్తున్నాం. ముఖ్యంగా అత్యంత ఖరీదైన ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు గతంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి సరఫరా అయ్యేవి. కొన్ని నెలలుగా వాటి సరఫరా లేకపోవడంతో ఉన్నతాధికారుల అనుమతితో స్థానికంగా కొనుగోలు చేసి రోగులకు అందిస్తున్నాం. దీనివల్ల రోగులు త్వరగా కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతున్నారు.

– డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

న్యూస్‌రీల్

ఆర్‌యూ నూతన వీసీగా వెంకట బసవ రావు



కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ (ఆర్‌యూ) నూతన వైస్‌చాన్సలర్‌గా ప్రొఫెసర్ ఉడత వెంకట బసవ రావును నియమించారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ జీవో జారీ చేసింది. అలాగే రాష్ట్ర గవర్నర్, వర్సిటీల ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేరుతో నోటిఫికేషన్‌ను జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలోని అన్ని వర్సిటీల వైస్ చాన్స్‌లర్‌లు జూలై నెలలో రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఏడు నెలల పాటు ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ కొనసాగుతున్నారు. ఆర్‌యూకు మంగళవారం నూతన వీసీగా వెంకట బసవరావు నియమితులయ్యారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న ఈయన ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఈ పదవిలో మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు.

ఫీజుకు పోస్టల్ ఖాతా తెరవండి

కర్నూలు(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని వివిధ కళాశాల్లో చదువుతున్న అనేక మంది ఎస్సీ విద్యార్థుల బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింకు కాకపోవడం వల్ల పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు తులసీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 263 మంది ఎస్సీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని, వీరంతా బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింకు చేయాలన్నారు. లేని పక్షంలో తమకు సమీపంలోని పోస్టాఫీసులో ఖాతా తెరిచి ఆధార్‌ను లింకు చేస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం జరుగుతుందన్నారు.

డిగ్రీ పరీక్షలకు 41 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు మంగళవారం 41 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 388 మందికి 347 మంది హాజరు కాగా 41 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

రోడ్ల పునరుద్ధరణకు ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్): నియోజకవర్గాల పరిధిలో పూర్తిగా దెబ్బతిన్న బీటీ రోడ్లను కొత్తగా పునరుద్ధరించేందుకు అవసరమైన ప్రతిపాదనలను వెంటనే పంపించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఒక్కో ఎమ్మెల్యే రూ.5 కోట్లు, మంత్రి రూ.10 కోట్ల మేర నిధులను ఆయా రోడ్లకు వెచ్చించేందుకు తమ లెటర్‌హెడ్లపై ప్రతిపాదనలను పంపించాలని కోరారు. కాగా ఇప్పటి వరకు ఎమ్మిగనూరు, ఆదోని మినహా జిల్లాలోని మిగిలిన కోడుమూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు అందాయి. ఇక మంత్రి టీజీ భరత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన రోడ్లు లేని నేపథ్యంలో ఇక్కడి నుంచి ప్రతిపాదనలు పంపాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని పీఆర్ ఇంజినీర్లు వెల్లడించారు.

జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి

- డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ ఆదేశించారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో జిల్లాలోని పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ వైద్యాధికారులకు కీటక జనిత వ్యాధులపై పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నాయని, ఆ ప్రాంతాల ప్రజలలో అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య విద్యాబోధన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం మలేరియా గురించి జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్లెస్సీ మోహన్, డెంగీ గురించి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి. శ్రీనివాసులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులను పరిశీలించిన కేంద్ర బృందం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

ఆలూరు రూరల్/హాలహర్వి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు కేంద్ర బృందం సీనియర్ ఆడిట్ అకౌంట్ ఆఫీసర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. ఆలూరు, హాలహర్వి మండలాల్లోని ఆలూరు, కురువళ్లి, బాపురం గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఆలూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ పాండ్ తనిఖీ చేశారు. కురువళ్లి గ్రామంలో ఉపాధి హామీ సెవన్ రిజిస్టర్ ఎలా నిర్వహిస్తున్నారో తనిఖీ చేశారు. పనుల రికార్డులను పరిశీలించి నిధుల వినియోగంపై కేంద్రానికి నివేదిక అందిస్తామని రాజేష్ కుమార్ తెలిపారు. వారి వెంట ఏపీడీ పద్మావతి, ఎంపీడీఓలు మహబూబ్ బాషా, వరలక్ష్మి, ఏపీఓలు శ్రీనివాసులు, చక్రవర్తి తదితరులు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాల్లో వర్మీ తయారీపై దృష్టి పెట్టండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నిర్మిస్తున్న సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ల షెడ్లను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి వర్మీ కంపోస్టు తయారీని ప్రారంభించాలని పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ కృష్ణతేజ ఆదేశించారు. మంగళవారం ఆయన అమరావతి నుంచి జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెల నుంచి గ్రామాల్లో ఇంటింటి చెత్తను కచ్చితంగా సేకరించి షెడ్లకు తరలించాలన్నారు. షెడ్ల ఉపయోగాన్ని గ్రామాల్లోని ప్రజలకు తెలిసే విధంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా డీపీఓ జీ భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 484 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 412 షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలిన వాటిని కూడా ఈ నెలాఖరుకు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని డివిజనల్ పంచాయతీ అధికారులు టీ లక్ష్మి, నూర్జహాన్, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులవాణితో పటు 25 మంది ఈఓఆర్‌డీలు పాల్గొన్నారు.

1962 మూగబోతుంది!

- సంచార పశువైద్య సేవలకు స్వస్తి పలుకుతున్న కూటమి ప్రభుత్వం
- మొదటి విడతగా జిల్లాకు వచ్చిన 13 వాహనాలు నిలిపివేత



డోన్‌లో పశుసంవర్ధక శాఖ అధికారికి సంచార పశు వైద్యశాలను స్వాధీనం చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): నోరులేని మూగజీవాలకు సత్వర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంచార పశు వైద్య (వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్) సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. 108, 104 తరహాలో మూగజీవాలకు అత్యవసర వైద్యం కోసం టోల్‌ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేస్తే చాలు దూరాన్ని బట్టి అరగంట నుంచి గంటలో సంచార వైద్యశాలలు చేరుకుని సేవలు అందించేవి. పశువుల పాలిట వరంగా మారిన వీటిని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు మొదటి విడతలో 13, రెండవ విడతలో 14 వాహనాలు వచ్చాయి. కర్నూలు నియోజకవర్గానికి ఒకటి ఉండగా... మిగిలిన అన్ని నియోజకవర్గాలకు రెండు ప్రకారం వెటర్నరీ మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పలుకుతోంది. మొదటి విడతలో జిల్లాకు వచ్చిన 13 వాహనాలు మంగళవారం పూర్తిగా నిలిచిపోయాయి. మొదటి విడతలో వచ్చిన 13 అంబులెన్స్‌ల నిర్వహణకు ఈఎంఆర్‌ఐ జీహెచ్‌ఎస్‌తో చేసుకున్న ఒప్పందం ముగిసిందనే కారణంతో వీటిని క్షేత్రస్థాయి నుంచి ఉపసంహరించింది. మొదటి విడతలో ఉమ్మడి జిల్లాకు వచ్చిన 13 అంబులెన్స్‌లను సంబంధిత ఏరియా పశు వైద్యశాలల ఏడీలకు స్వాధీనం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీంతో మంగళవారం అంబులెన్స్‌లను పశుసంవర్ధక శాఖ అధికారులకు అప్పగించారు. రెండవ విడతలో వచ్చిన 14 అంబులెన్స్‌ల సేవలను కూడా రేపో, మాపో ఉపసంహరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పశువుల పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు పశువైద్య శాలకు ఈ అంబులెన్స్ ద్వారానే తరలించి వైద్యం అందించిన ఘటనలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సేవలకు ప్రభుత్వం తొలగిస్తుండటంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగుల్లో గుబులు...

సంచార పశువైద్య శాలలను నిలిపివేయడంతో ఉద్యోగుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కో అంబులెన్స్‌కు ముగ్గురు ప్రకారం అందరూ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్లను ఎత్తేసింది. ఇప్పుడు సంచార పశువైద్య శాలలను పక్కన పెట్టి నిరుద్యోగుల ఉసురు పోసుకుంటోంది.

రైతు కన్నీరు పెట్టిన రాజ్యం బాగుపడదు





విక్రయాలు లేక కర్నూలు మార్కెట్‌లో ఉన్న మిర్చి దిగుబడులు, మిర్చి రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

- మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): పంటలకు మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు అల్లాడుతున్నా పాలకుల్లో చలనం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. రైతులు కన్నీరు పెట్టిన రాజ్యం బాగుపడదన్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయాలు లేకుండా నిల్వ ఉన్న మిర్చి దిగుబడులను మంగళవారం కాటసాని పరిశీలించారు. మిర్చి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పెట్టుబడి వ్యయం ఎంత వచ్చింది.. దిగుబడి ఎలా ఉంది.. మార్కెట్‌లో ధరలు ఎలా ఉన్నాయనే దానిపై రైతులతో చర్చించారు. మిర్చి రైతులు తమ ఆందోళనను కాటసానికి వివరించి కన్నీరుమున్నీరయ్యారు. ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.లక్ష వరకు వస్తోందని, దిగుబడి 20 క్వింటాళ్ల వరకు వస్తున్నా.. క్వింటాకు రూ.10 వేల వరకు మాత్రమే ధర లభిస్తోందని, పెట్టుబడి కూడా దక్కడం లేదని వివరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి పంటకు మద్దతు ధర కల్పించామన్నారు. మద్దతు కంటే ధరలు తగ్గిన ప్పుడు రైతులు నష్టపోకుండా ఆర్‌బీకేల వారీగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అప్పట్లో మిర్చి ధర రూ.50 వేలకుపైగా పలికిందని, నేడు కనీసం రూ.10 వేలు కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పంటను రైతులు అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. మిర్చి ధర అట్టడుగుకు పడిపోయినా.. ప్రభుత్వం చొరవ తీసుకొని ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. న్యాయం కోసం అన్నదాతలతో కలసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు ఆర్‌బీకేల్లోనే అందుబాటులో ఉంచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేలకు ఉరివేస్తోందని మండిపడ్డారు. అనంతరం మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మితో సమావేశమై మిర్చి ధరలు పడిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా పోటీతత్వంతో కొనుగోలు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి సరఫరా బంద్

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పది గేట్లను పూర్తిగా మూసివేసి నీటి సరఫరాను బంద్ చేశారు. శ్రీశైలం జలాశయంలో 841 అడుగుల నీటి మట్టం చేరుకునే వరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి దిగువ ప్రాంతాలకు నీటిని సరఫరా చేసుకునే అవకాశాలున్నాయి. అయితే ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 850.50 అడుగులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 849.50 అడుగుల నీటి మట్టం ఉన్నా అధికారులు పోతిరెడ్డిపాడు గేట్లు మూసివేసివేయడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదలను నిలిపివేయటం వెనుక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె!





క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 11 రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే ఈ వేడుకలకు బుధవారం అంకురార్పణ చేయనున్నారు. ఉభయ దేవాలయాలను వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

- వివరాలు 8లో▸

ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండండి

- డీఐజీ కోయ ప్రవీణ్



కోసిగి సర్కిల్ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

ఆదోని అర్బన్/కోసిగి/కౌతాళం: జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల ప్రజలు ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండి పిల్లలను ఉన్నతంగా చదివించుకోవాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సూచించారు. మంగళవారం ఆయన ఆదోని డీఎస్పీ కార్యాలయాన్ని, కోసిగి, కౌతాళం స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, పోలీసు పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు క్షణికావేశాలతో ఘర్షణలకు పాల్పడితే తీవ్రంగా నష్టపోతారన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా సహించేది లేదన్నారు. పోలీస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మసలుకోవాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐలు అశోక్‌కుమార్, మంజునాథ్, కోసిగి, పెద్దకడబూరు ఎస్ఐలు చంద్రమోహన్, నిరంజన్ రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

పేకాటస్థావరాలపై దాడులు చేపట్టండి

- పోలీసు ఉన్నతాధికారులకు ఆదోని ఎమ్మెల్యే బహిరంగ లేఖ

ఆదోని అర్బన్: ఆదోనిలో 'పేకాట...కాసుల వేట' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి స్పందించారు. తన నియోజకవర్గంలో పేకాట స్థావరాలపై దాడులు చేసి నిర్వాహకులను కఠినంగా శిక్షించాలని మంగళవారం జిల్లా ఎస్పీ, ఆదోని డీఎస్పీ, సీఐ, ఎస్ఐలకు బహిరంగ లేఖ విడుదల చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గకుండా అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని అందులో కోరారు.

అదృశ్యమైన వ్యక్తి కాలువలో శవమై తేలాడు

మద్దికెర: అదృశ్యమైన మద్దికెర గ్రామానికి చెందిన బోగోలు తిరుమలరెడ్డి (45) సోమవారం శవమై తేలాడు. వివరాల్లోకి వెళితే.. తిరుమల రెడ్డి పిల్లల చదువుకోసం గుంతకల్లులో నివాసం ఉంటున్నాడు. బుగ్గ సమీపంలోని వ్యవసాయతోటలో పనులతో పాటు సొంతంగా యూట్యూబ్ చానెల్ పెట్టి వార్తలు సేకరిస్తూ జీవనం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే తోటకు వస్తూ అదృశ్యమయ్యాడు. కాలువ వద్ద స్కూటర్, సెల్‌ఫోన్ పడి వుండడంతో పోలీసులు ఆచూకీ కోసం కాలువలో వెతికినా ఫలితం కనబడలేదు. అయితే మంగళవారం మధ్యాహ్నం శవమై తేలడంతో పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లుకు తరలించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి దుర్మరణం

కోవెలకుంట్ల: పట్టణంలోని గుంజలపాడు రహదారిలో సుంకులమ్మ గుడి సమీపంలోని కొత్త కాలనీలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. సంజామల మండలం నట్లకొత్తూరుకు చెందిన ఉప్పలూరు వెంకటసుబ్బారెడ్డి (41) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాలనీలో రోడ్డు వేసేందుకు పట్టణ శివారులోని కుందూనది ఒడ్డున ఉన్న బెలుకురాళ్లను ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్నాడు. రాళ్లట్రాలీని అన్‌లోడ్ చేసే క్రమంలో కిందకు దిగి ట్రాలీ డోర్ తీస్తుండగా ట్రాక్టర్ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వెనక్కు కదిలింది. ట్రాక్టర్‌ను ఆపేందుకు వచ్చే క్రమంలో ప్రమాదశాత్తు ట్రాక్టర్ టైరు కింద పడటంతో తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య శారద, కుమారుడు సోమేశ్వరరెడ్డి ఉన్నారు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.





ఇలకైలాసంలో బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి 11 రోజులు శ్రీశైల మల్లన్నకు విశేష వాహనసేవలు, గ్రామోత్సవం
- 26న పాగాలంకరణ, కల్యాణోత్సవం
- మొదటి రోజు శ్రీకాళహస్తి దేవస్థానం వారిచే పట్టువస్త్రాల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో శ్రీశైలాలయం


క్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసిన చలువ పందిర్లు

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. 11 రోజుల పాటు ఎంతో వైభవంగా జరిగే ఈ వేడుకలకు బుధవారం అంకురార్పణ జరుగనుంది. ఉదయం యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవ క్రతువులు ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిణి అయిన భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు, స్వామి అమ్మవార్లకు వివిధ వాహనసేవలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఉభయ దేవాలయాలను వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే ప్రధాన ఆలయానికి ఎదురుగా, క్షేత్ర పరిధిలో ముఖ్యమైన కూడళ్లలో స్వామి అమ్మవార్ల చిత్రపటాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉదయం 9 గంటలకు అంకురార్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశంతో ఉత్సవాల క్రతువులు ప్రారంభమవుతాయి. వేద స్వస్తి, శివసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, చండీశ్వరపూజ, కంకణపూజ, దీక్షాకంకణ ధారణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధన, రుద్రకలశ స్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు జరుపుతారు. అలాగే సాయంత్రం 5.30 గంటలకు సాయంకాలార్చనలు, అగ్నిప్రతిష్టాపన, అంకురార్పణ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు భేరిపూజ, భేరీతాడనం, సకలదేవతాహ్వానపూర్వక ధ్వజారోహణ, ధ్వజపట అవిష్కరణ నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు.

పట్టువస్త్రాలు సమర్పించనున్న శ్రీకాళహస్తి దేవస్థానం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం భ్రమరాంబామల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనుంది. సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామిఅమ్మవార్లకు సమర్పిస్తారు.

విశేష వాహనసేవలు ఇలా..

- 20న భృంగి వాహనసేవ
- 21న హంస వాహనసేవ
- 22న మయూర వాహనసేవ
- 23న రావణ వాహనసేవ
- 24న స్వామి అమ్మవార్లకు పుష్ప పల్లకీసేవ
- 25న గజ వాహన సేవ
- 26న ప్రభోత్సవం, నందివాహనసేవ, రాత్రి 10గంటలకు లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, కల్యాణోత్సవం
- 27న స్వామిఅమ్మవార్లకు రథోత్సవం, తెప్పోత్సవం.
- 28న బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి. సాయంత్రం ధ్వజావరోహణ
- మార్చి 1న అశ్వ వాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ

నమో.. నారసింహా!

- వైభవంగా పార్వేట ఉత్సవాలు

రుద్రవరం: అహోబిల నరసింహస్వామి పార్వేట ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవ మూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారు పల్లకీలో కొలువు దీరి పూజలు అందుకుంటున్నారు. పల్లకీ గ్రామాలకు వెళ్లగానే ప్రజలు ఘనంగా స్వాగతిస్తున్నారు. స్వామివారి పల్లకీ మంగళవారం తిప్పారెడ్డిపల్లెలోని పలు తెలుపుల మీద కొలువుదీరగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకీ మండలంలోని టి.లింగందిన్నెకు చేరుకుంది.

ఎగ్జిబిషన్ ఏర్పాటుకు బహిరంగ వేలం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: మహానందిలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో జెయింట్ వీల్, ఎగ్జిబిషన్ ఏర్పాటు కోసం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో ఐదుగురు డిపాజిట్లు చెల్లించి పోటీ పడ్డారు. దేవస్థానం పాట రూ. 3.50 లక్షల నుంచి మొదలుకాగా గోపవరం గ్రామానికి చెందిన చంద్రుడు (చంద్ర) రూ. 5.15 లక్షలతో హెచ్చుపాటదారుడిగా నిలిచి దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 3.50లక్షలు వచ్చిందని, ఈ ఏడాది అదనంగా రూ. 1.65 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

నేడు టెన్నికాయిట్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): కర్నూలు, నంద్యాల జిల్లాల స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ ఎంపిక పోటీలు (సీనియర్స్ విభాగం) బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ సంఘం కార్యదర్శి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారులోని వెంకయపల్లెలో ఉన్న సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభ కనబరిచి ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 21, 22 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం చిట్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న 48 వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9398401721 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భూమి కొనుగోలు అక్రమాలను వెలికితీస్తాం

- నిరుపేద దళితులకు న్యాయం చేసేందుకు చర్యలు
- ఏపీ మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయకుమార్


మాట్లాడుతున్న ఛైర్మన్ పెదపూడి విజయకుమార్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఆదోని మండలం చిన్న గోనేహాల్, చిన్న హరివాణం గ్రామాల్లో 2018-2019లో భూమి లేని నిరుపేద దళితుల కోసం ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన భూములపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఏపీ మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయకుమార్ అన్నారు. ఈ రెండు గ్రామాల్లో 76 మంది లబ్ధిదారులకు రూ.4.65 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన 76.52 ఎకరాల భూములను ఇప్పటి వరకు ఒక్క దళిత కుటుంబానికి కూడా అందించలేదనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇందులో ఎవరెవరి పాత్ర ఎంత ఉందనేది తేల్చి అర్హులైన లబ్ధిదారులందరికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తామన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నామని, అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌ల స్థితిగతులను కూడా పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో రిపేర్లు చేపట్టనున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ యువతకు మెరుగైన స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కూడా ఖచ్చితంగా ఆయా సామాజిక వర్గాల కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు వెచ్చించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మాల, మాదిగ కార్పొరేషన్ల డైరెక్టర్లు పోతురాజు రవికుమార్, ధరూరు జేమ్స్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె. తులసీదేవి పాల్గొన్నారు.

ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుపరచాలి

- న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి


ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: జైలులో ఉన్న ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుపర్చాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. కర్నూలు పురుషుల కేంద్ర కారాగారం, మహిళా కారాగారాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్ గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేటు, పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. సత్ప్రవర్తనతో ఖైదీలు జైలు శిక్షను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఖైదీలకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని, వారి ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యల గురించి పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుపరచాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100పై ఖైదీలకు అవగాహన కల్పించారు. జైలు అధికారులతో పాటు న్యాయవాది శివరాం కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లాకు దామోదరం పేరు పెట్టాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్


సంజీవయ్య ఇంటిని పరిశీలిస్తున్న రామకృష్ణ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తాని తెలిపారు. మంగళవారం ఆయన కల్లూరు మండలం పెద్దపాడులోని దామోదరం సంజీవయ్య ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంజీవయ్య గృహాన్ని టూరిస్టు ప్రదేశంగా మార్చాలన్నారు. ఆయన జ్ఞాపకార్థం కర్నూలు స్మారక స్థూపం, విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పెద్దపాడులో కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజు ఉన్నారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం


మృతి చెందిన మహబూబ్‌బీ

ఓర్వకల్లు: మండలంలోని చెన్నంశెట్టిపల్లె మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లెకు చెందిన షేక్ చిన్న ఉసేన్‌సాహెబ్ కుమారుడు షేక్షావలి, అతని భార్య షేక్ మహబూబ్‌బీ(45) అనే భార్యాభర్తలు ఇద్దరు మంగళవారం ఉదయం సొంత పనిమీద బైక్‌పై ఓర్వకల్లు వెళ్లారు. పని ముగించుకొని సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా మార్గంమధ్యలో చెన్నంశెట్టిపల్లె క్రాస్ రోడ్డు వద్ద బేతంచెర్ల నుంచి నంద్యాల వైపునకు వెళుతున్న తెలంగాణాకు చెందిన కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బీ బైక్‌పై నుంచి కింద పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదతీరును పరిశీలించారు. మృతురాలి భర్త షేక్షావలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

ఈఆర్‌సీపీతో పిత్తాశయ మార్గంలోని రాయి తొలగింపు


కోలుకున్న వృద్ధుడితో డాక్టర్ అబ్దుల్ సమద్

కర్నూలు(హాస్పిటల్): పిత్తాశయ మార్గంలో రాయి ఏర్పడిన వృద్ధునికి కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు ఆపరేషన్ అవసరం లేకుండా ఈఆర్‌సీపీ విధానంలో రాయి తొలగించారు. వివరాలను మంగళవారం మెడికవర్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ పి. అబ్దుల్ సమద్ వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...'కర్నూలుకు చెందిన 84 ఏళ్ల వృద్ధునికి జ్వరం, కడుపునొప్పి, పసిరికలు ఉండటంతో హాస్పిటల్‌కు వచ్చాడు. అతనికి వైద్యపరీక్షలు నిర్వహించగా కామన్ బైల్ డ్యాక్ట్ అనే 14 ఎంఎం పరిమాణంలో రాయి పిత్తాశయ మార్గంలో ఉంది. దీని వల్ల అతనికి పసిరికలు వచ్చాయి. అయితే, వయస్సు ఎక్కువగా ఉండటంతో పాటు అతనికి గుండెజబ్బు ఉంది. యాంటిప్లేట్‌లెట్ థెరపీ తీసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ముందుగా అవసరమైన యాంటిబయాటిక్స్ ఇచ్చి మూడు రోజుల తర్వాత అనెస్తీషియా వైద్యుడు డాక్టర్ బాలప్రవీణ్ సహకారంతో ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కోలాంగియోపాంక్రియాటోగ్రఫి(ఈఆర్‌సీపీ) ప్రక్రియ ద్వారా పిత్తాశయ మార్గంలోని రాయిని తొలగించాము. దీంతో ఆయన త్వరగా కోలుకోవడంతో ఒక రోజు ఆసుపత్రిలో ఉంచుకుని డిశ్చార్జ్ చేశాం' అని వెల్లడించారు. సమావేశంలో హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జాతరలో దొంగలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో దొంగలు పడ్డారు. భక్తుల మెడల్లోని బంగారు ఆభరణాలు, జేబుల్లోని నగదును అపహరించారు. కోసిగికు చెందిన బండారు అనసూయ మెడలో ఉన్న మూడు తులాల బంగారు తాళిబొట్టు, ఆదోనికి చెందిన పార్వతి అనే మరో మహిళ మెడలోని 3.50 గ్రాముల బంగారు చైన్, కోసిగికి చెందిన నరసయ్య అనే వ్యక్తి జేబును కత్తిరించి రూ.40వేలు నగదు దోచేశారు. బాధితులు ఆలస్యంగా చూసుకొని కోసిగి పోలీసులను ఆశ్రయించారు.

గ్రూపు-2 మెయిన్స్ పరీక్షకు 30 కేంద్రాలు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 23న జరిగే గ్రూపు-2 మెయిన్స్ పరీక్షకు జిల్లాలో 30 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 9,993 మంది పరీక్ష రాయనున్నారు. జేసీ నవ్యను కో ఆర్డినేట్ అధికారిగా ఏపీపీఎస్సీ నియమించింది.

అభ్యర్థులకు సూచనలు ఇవీ..

- పరీక్ష రాసే వారు 15 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలి. ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి.
- ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 నుంచి 5.30గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు.
- హాల్ టికెట్‌పై అభ్యర్థి ఫొటో సరిగ్గా కనిపించకపోయినా, చిన్నదైనా, అస్పష్టంగా ఉన్నా దానిపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలి. మూడు పాస్ ఫొటోలు తీసుకెళ్లాలి.
- పరీక్ష కేంద్రంలోకి టాబ్లెట్లు, ఐప్యాడ్లు, రైటింగ్ ప్యాడ్లు, హ్యాండ్ బ్యాగులు, ఏదైనా పేపర్లు , పుస్తకాలు, మొబైల్ ఫోన్‌లు, స్మార్ట్, డిజిటల్ వాచ్‌లు, క్యాలికులేటర్లను అనుమతించరు. అనలాగ్ మణికట్టు గడియారాలను కూడా అనుమతించరు. ● బ్లాక్, బ్లూ బాల్ పెన్నులను వాడాలి. పెన్సిల్‌ను ఉపయోగించరాదు. ● అంధత్వం, రెండు చేతులు లేని వారు, సెరిబ్రల్ పాల్సీ విభాగంలో బెంచ్ మార్కు వైకల్యం ఉన్న వారు కోరుకుంటే లేఖరి/రీడర్/ల్యాబ్ సహాయకులను నియమించుకోవచ్చు.
- గ్రూపు-2 మెయిన్స్ పరీక్షకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయడం కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్కును ఏర్పాటు చేశారు. ఇది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరక అందుబాటులో ఉంటుంది. సందేహాలకు 08518-277305కు ఫోన్ చేయవచ్చని జేసీ డాక్టర్ బి.నవ్య తెలిపారు.

ప్రాక్టికల్ పరీక్షలకు 39 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు మంగళవారం 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ సునీత తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 976 మందికి గాను 960 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్ పరీక్షకు 915 మందికి గాను 892 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. అన్ని కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయన్నారు.

గడ్డివాములు దగ్ధం

కర్నూలు: మండలపరిధిలోని పంచలింగాల గ్రామంలో ఐదు గడ్డివాములు కాలిబూడిదయ్యాయి. గ్రామ శివారులో మహిమాకర్, బాబు, దావీదు, సంజన్న, గాయన్న తదితరులకు చెందిన కల్లందొడ్లు పక్కపక్కనే ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం గడ్డివాములో నుంచి పొగ రాసుకుని పెద్దగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకునేసరికి గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది నీళ్లు చల్లి మంటలను పక్క కల్లందొడ్లకు వ్యాపించకుండా అదుపు చేశారు.

సుగాలి ప్రీతి కేసును నీరుగార్చే యత్నం

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి సర్కారుకు లేదు
- యూటర్న్‌పై పవన్ కళ్యాణ్ స్పందించాలి
- మహిళలకు భద్రత కల్పించడంలో హోం మంత్రి విఫలం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ


మాట్లాడుతున్న శశికళ

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పదోతరగతి దళిత విద్యార్థిని సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి కేసును రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తుందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సుగాలిప్రీతి హత్యకు గురైందన్నారు. దోషులను కాపాడేందుకు చంద్రబాబు ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్న చిత్తశుద్ధి ఆయనకు లేదన్నారు. అందుకే సీబీఐ నుంచి తప్పించి విచారణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే విధంగా రఘురామరాజు అనే వ్యక్తి ద్వారా హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయించారని ఆరోపించారు. వైఎస్ జగన్ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే సుగాలి ప్రీతి కుటుంబానికి రూ. 8 లక్షలు ఆర్థిక సహాయం, 5 ఎకరాల భూమి, ఇంటి కోసం 5 సెంట్ల స్థలం ఇచ్చారన్నారు. అంతేకాకుండా కేసు దర్యాప్తు వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలని సీబీఐకు అప్పగించారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఈ కేసును నిర్వీర్యం చేసేందుకు కుయుక్తులకు పాల్పడుతుందన్నారు. హత్య జరిగిన రెండేళ్ల వరకు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నారని, 2017 సంవత్సరం ఆగస్టు నెలలో ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ శంకర్ స్పష్టంగా పోస్టుమార్టం నివేదికలో బాలికపై అత్యాచారం, హత్య జరిగినట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారన్నారు. అప్పట్లో కట్టమంచి రామలింగారెడ్డి కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు, పోక్స్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. అయితే, 23 రోజుల వ్యవధిలోనే వారు బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు.

పాలన చేత కాక డైవర్షన్ పాలిటిక్స్

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తూ రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని శశికళ విమర్శించారు. జగనన్న హయాంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని చెప్పారు. చంద్రబాబు రూ.73 వేల కోట్లు అప్పులు చేసి ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రెడ్ బుక్‌పాలనకు త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. కూటమి నాయకులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి అక్రమ సంపాదనే ధ్యేయంగా లిక్కర్, ఇసుక, పేకాట క్లబ్‌ల నిర్వహణలో బీజీగా ఉన్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకురాలు కల్లా నాగ వేణి రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు మంగమ్మ, రాధికమ్మ తదితరులు పాల్గొన్నారు

నాడు శిక్షిస్తానన్న పవన్ కళ్యాణ్ స్పందించాలి

సుగాలి ప్రీతి కేసులో దోషులను శిక్షించే వరకు వదిలేది లేదని, వారిని తొక్కిపెట్టి నారా తీస్తానని ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాడు పెద్ద పెద్ద మాటలు చెప్పి ఇప్పుడు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వ్యక్తి బాధిత కుటుంబానికి న్యాయం చేయలేకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలల కాలంలో 78 మంది మహిళలపై అఘాయిత్యాలు జరిగాయన్నారు. హోంమంత్రి అనిత మహిళలకు రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు.